## క్లుప్తంగా

### హాస్టళ్ల తనిఖీ



మహిళా హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ నాగమణి

**పావగడ:** పట్టణంలోని హాఫ్ బండ మీద ఉన్న ప్రభుత్వ మహిళా హాస్టల్‌ను తహసీల్దార్ నాగమణి శుక్రవారం తనిఖీ చేశారు. ఆదర్శ నగర్, ఏ కే కాలనీల లోని అంగనవాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ సెలవులు ముగియడంతో ఇప్పుడిప్పుడే విద్యార్థులు హాస్టళ్లకు వస్తున్నారని, హాస్టళ్లలో పరిశుభ్రత, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అంగనవాడీకేంద్రాల్లో ఆహారం, పిల్లల హాజరు నమోదును పరిశీలించామన్నారు. ఆదర్శనగర్‌లోని అంగనవాడీ కేంద్రంలో శౌచాలయ సమస్యను సీడీపీఓ దృష్టికి తీసుకొచ్చారన్నారు.

### ఉపాధ్యాయులను గౌరవించాలి

**పావగడ:** ఒక ఉపాధ్యాయుడు వేయి ఆలయాలతో సమానమని యాదవ సంఘం అధ్యక్షుడు ముగదాళబెట్ట నరసింహప్ప తెలిపారు. తాలూకాలోని ముగదాళబెట్ట గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో శుక్రవారం నిర్వహించిన నివృత్తి చెందిన హెచ్ఎం సత్యనారాయణ వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. పీడీఓ మంజునాథ్ మాట్లాడుతూ పనికి రాని శిలను శిల్పంగా రూపొందించి సమాజం లో విలువ కల్పించిన ఉపాధ్యాయులను విద్యార్థులు సదా గౌరవించాలన్నారు. ఈ సందర్భంగా నివృత్త సత్యనారాయణ దంపతులను ఘనంగా సన్మానించారు.

### ఘనంగా నీలకంఠేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం



అలంకరణలో సరస్వతీదేవి

**మడకశిరరూరల్:** నీలకంఠాపురంలోని నీలకంఠేశ్వరస్వామి సముదాయ ఆలయ ద్వితీయ వార్షికోత్సవం శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. నీలకంఠేశ్వరస్వామి, పంచముఖి, ప్రసన్న అంజియస్వామి, సరస్వతీదేవి, లక్ష్మీరంగనాథుస్వామి, లక్ష్మీనరసింహ స్వామి, కొదండరాయస్వామి, సుబ్రమణ్య స్వామి, విద్యాగణపతి, సత్యనారాయణ స్వామి వరమహాలక్ష్మీ తదితర 20 ఆలయాల్లో అర్చకులు స్వామి వార్లకు వివిధ పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాద వినియోగం చేశారు.

### ఘనంగా వాసవీ జయంతి



వాసవీమాతకు క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

**హిందూపురం:** స్థానిక బాలాజీ నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మేళాపురం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవీ జయంతిని నిర్వహించారు. ఉదయం మూలవిరాట్ లక్ష్మీ వేంకటేశ్వర స్వామికి పంచామృతాషేకాలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో వాసవీమాత విగ్రహాన్ని కొలువుదీర్చి మహిళలు, భక్తులు క్షీరాభిషేకాలు చేశారు. అలాగే అమ్మవారి అష్టోత్తర నామవాళితో కుంకుమార్చనలు చేపట్టారు. మంగళ హారతుల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహించారు.

### రాగిపంట సాగుపై దృష్టి సారించాలి



సమావేశానికి హాజరైన రైతులు

**సోమందేపల్లి:** రైతులు వేరుశనగతోపాటు రాగిపంట సాగుపైనా దృష్టి సారించాలని జేసీ చేతన్ సూచించారు. శుక్రవారం మండలంలోని మండ్లి గ్రామంలో రాగిపంట సాగుకు సంబంధించి రైతులకు అవగాహన కల్పించారు. జేసీ మాట్లాడుతూ బీడు భూముల్లో రాగిపంట సాగు చేయడం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందొచ్చన్నారు. రైతులు సాగుచేసిన రాగి పంటను సివిల్ సప్లయీస్ ద్వారా ప్రభుత్వం ఒక క్వింటాల్ ధర రూ.3,578 చొప్పున కొనుగోలు చేస్తుందన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో రాగి పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఏఓ సుబ్బారావు, ఏడీ స్వయంప్రభ, ఏఓ కవితారాణి తదితరులు పాల్గొన్నారు.

# కలువల సోయగం




విరబూసిన కలువలు

హిందూపురం పట్టణంలోని శ్రీకంఠపురం చెరువు కలువ పుష్పాలతో చూపరులను కనువిందు చేస్తోంది. గతేడాది విస్తారంగా కురిసిన వర్షాలకు చెరువు నీటితో తొణికిసలాడుతోంది. చెరువులో కలువ తీగలు పెద్ద ఎత్తున విస్తరించి నిండుగా పూలతో పరిచినట్లు చూపరులను ఆకట్టుకున్నాయి. చెరువు లోతుగా ఉండటంతో పూలను కోసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. అటుగా వెళ్లే వారు పూల అందాలను ఆస్వాదిస్తున్నారు. – హిందూపురం:



వైట్, పింక్ కలర్‌లో కనువిందు చేస్తున్న కలువలు...





## జూదరుల అరెస్ట్

**చిలమత్తూరు:** సంజీవరాయునిపల్లి శివారులోని పేకాట స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి, రూ.10,300 నగదు, మూడు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

## బలిజ విద్యార్థులకు పురస్కారాలు

**హిందూపురం:** నియోజకవర్గంలో 2022–23 విద్యా సంవత్సరంలో పది, ఇంటర్‌లో ఉత్తమ మార్కులు సాధించిన బలిజ విద్యార్థులకు పురస్కారాలు అందజేయనున్నట్లు బలిజ సేవా సంఘం కార్యదర్శి ప్రభాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 10వ తరగతిలో 450మార్కులు పైబడి ఇంటర్ సైన్సులో 750 మార్కులు, ఆర్ట్స్‌లో 600 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులతో పాటు డిగ్రీ, పీజీలో 60 శాతం మార్కులు పొందిన విద్యార్థినీ విద్యార్థులకు పురస్కారాలు అందించి ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. మరింత సమాచారం కోసం 8919912951, 9701636797 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

## కంప్యూటర్ ఏర్పాటు

**పెనుకొండ:** పట్టణంలోని బార్ అసోసియేషన్ గదిలో సీనియర్ సివిల్ జడ్జి శంకరరావు శుక్రవారం కంప్యూటర్ ఏర్పాటు చేశారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ఈ అవకాశాన్ని న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నూతన మోటారు, ఆర్‌ఓ ప్లాంట్‌ను న్యాయమూర్తి పరిశీలించారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.




## పండ్లతోటల పెంపకంపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి నరసయ్య

**రొద్దం:** ప్రతి గ్రామ పంచాయతీలో పండ్లతోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి, పీడీ నరసయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణం, ఉపాధిహామీ పథకం, హార్టికల్చర్, కూలీల సంఖ్య పెంపుపై ఆయన సమీక్ష నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ కూలీల సంఖ్య పెంచడానికి సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవతం చేయాలన్నారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారుల వివరాలు ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. పండ్లతోటలు పెంచడానికి రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం ఐకేపీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీశ్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఐకేపీ ఏపీఎం విశ్వనాథ్, సిబ్బంది, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**పావగడ:** తాలూకా వ్యాప్తంగా కర్ణాటక వసతి విద్యా సంస్థల సంఘాల ఆధీనంలో నిర్వహిస్తున్న 8 వసతి పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల శనివారంలోపు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లత తెలిపారు. నెలకు గౌరవ వేతనం రూ.16,650 అందిస్తామన్నారు. ఈ నెల 7న కన్నడ, ఆంగ్లం, హిందీ భాషా విషయాలపై ఇంటర్వ్యూ, డెమో, 8న ఆప్షనల్స్ అంశాలపై ఇంటర్వ్యూ, డెమో ఉంటాయన్నారు. తాలూకా లోని పళవల్లి డా బీఆర్ అంబేద్కర్ వసతి పాఠశాలలో ఉదయం 10 గంటల సమయంలో ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. వివరాలకు ప్రిన్సిపాల్ లత 9743663939, కస్తూరి కుమార్ 9916586369, తిప్పేస్వామి 9448936614 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

## సజావుగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్ష

**అమరాపురం:** అమరాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీమోడల్ పాఠశాలలో శుక్రవారం పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో సజావుగా జరిగాయి. తెలుగు సబ్జెక్టుకు సంబంధించి మొత్తం 130 మందికి గాను 106 మంది విద్యార్థులు హాజరయ్యారని డిపార్ట్‌మెంటల్ అధికారులు చలపతి, గణేష్ తెలిపారు.

**మడకశిర:** పట్టణంలో శుక్రవారం పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ(తెలుగు) పరీక్ష సజావుగా జరిగింది. బాలుర ఉన్నత పాఠశాలలో 74 మంది విద్యార్థులకు గాను 60 మంది, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 104 మందికి గాను 88 మంది, సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో 71 మందికి గాను 59 మంది హాజరైనట్లు ఎంఈఓ భాస్కర్ తెలిపారు.

**సప్లిమెంటరీ పరీక్షకు 52 మంది హాజరు**

**చిలమత్తూరు:** స్థానిక పాట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన పదో తరగతి తెలుగు సప్లిమెంటరీ పరీక్షకు 68 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 52 మంది విద్యార్థులు హాజరైనట్టు ఇన్‌చార్జి ఎంఈఓ నాగరాజు పేర్కొన్నారు.

## సీఎం జగన్‌ను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు



ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బూదిలి రాజశేఖరరెడ్డి

**గోరంట్ల:** మండల పరిధిలోని బూదిలికి చెందిన గోరంట్ల మార్కెట్ యార్డు చైర్మన్ బూదిలి వేణుగోపాల్‌రెడ్డి సోదరుడి కుమారుడు రాజశేఖరరెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. కర్నూలు జిల్లాలో హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందించారు.

## హౌసింగ్ పనులు వేగవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

**లేపాక్షి:** మండలంలో జగనన్న కాలనీల్లో హౌసింగ్ పనులు వేగవంతం చేయాలని శ్రీసత్యసాయి జిల్లా ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ డైరెక్టర్, మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ నరసింహ నాయుడు, ఏఈ వాసంతి, సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్లతో సమీక్షించారు. మండల వ్యాప్తంగా 17 జగనన్న కాలనీల్లో 1,359 ఇళ్లు మంజూరు కాగా 429 ఇళ్లు మాత్రమే పూర్తి అయ్యాయని ఏఈ వివరించారు. బేస్‌మెంట్ లోపల 467, బేస్‌మేట్ కింద 327, రూఫ్ లేవెల్ కింద 69, ఇంటికప్పు వేసినవి 21 ఉన్నట్లు తెలిపారు. అనంతరం మండల స్పెషల్ ఆఫీసర్ సుదర్శన్ మాట్లాడుతూ.. హౌసింగ్ పనులు చేయడంలో నిర్లక్ష్యం ఎందుకని ప్రశ్నించారు. బిల్లులు కూడా సకాలంలో ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం చోళసముద్రం లేఅవుట్‌ను పరిశీలించి వివరాలపై ఆరా తీశారు. చోళసముద్రం లేఅవుట్‌లో 72 ఇళ్లు మంజూరు కాగా ఒక్క ఇల్లు కూడా పూర్తి కాలేదన్నారు. సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## పథకాలపై ఇంటింటా ప్రచారం

**హిందూపురం టౌన్:** ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్రం ప్రభుత్వం తీసుకువచ్చిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధిపై ఇంటింటి ప్రచారం నిర్వహించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పార్థసారథి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో పట్టణ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై వాడవాడలా తెలిసేలా నెల రోజుల పాటు ప్రచారం చేయాలన్నారు. 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని పట్టణంలోని ప్రతి ఒక్క శక్తి కేంద్రంలో యోగా డే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వరప్రసాద్, అసెంబ్లీ కన్వీనర్ ఆదర్శ్‌కుమార్, కోకన్వీనర్ బాబు, నాయకులు భాగ్యలక్ష్మీ, దివాకర్‌నాయుడు, లక్ష్మీనారాయణ, కిష్టప్ప, మోహన్, మహాలక్ష్మి అనిత తదితరులు పాల్గొన్నారు.

## నాడు- నేడు పనుల పరిశీలన



నాడు - నేడు పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సరస్వతి

**పరిగి:** మండలంలోని పాఠశాలల్లో జరుగుతున్న నాడు – నేడు పనులను ఎంపీడీఓ సరస్వతి శుక్రవారం పరిశీలించారు. మండలంలోని శ్రీరంగరాజుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాదాపు రూ.కోటికి పైగా ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు, ప్రహరీ నిర్మాణ పనులు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రభాకర్‌రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ కృష్టారెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ప్రమాదం

**రొద్దం:** చిన్నమంతూరు ప్రాథమిక పాఠశాల ఎదుట వ్యవసాయ పొలంలో విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. పాఠశాల ప్రారంభమైతే విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు వాపోతున్నారు. 11 కేవీ విద్యుత్ వైర్లు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయని ట్రాన్స్‌కో అధికారుకలు పలుమార్లు విన్నవించినా వారు స్పందించలేదని గ్రామస్తులు అంటున్నారు.

## ఘనంగా బీఎస్పీ ఆవిర్భావ దినోత్సవం

**హిందూపురం టౌన్:** స్థానిక బీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం బహుజన సమాజ్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, కాన్షీరామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా పార్టీ ఉద్భవించిందన్నారు. అదే పంథాలోనే ఉద్యమిస్తోందన్నారు. బీఎస్పీ పార్టీ ద్వారానే బహుజనులకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు హరికుమార్, నారాయణప్ప, నారాయణ, చంద్రశేఖర్, సుబ్బరాయప్ప, బాలగంగాదర్, గంగప్ప, గంగాధర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అడ్మిషన్ల కోసం స్పెషల్ డ్రైవ్

**పెనుకొండ:** పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్ అడ్మిషన్ల కోసం హెచ్ఎం జ్యోతిలత శుక్రవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.

## పేకాట స్థావరాలపై దాడి

- రూ.1.33 లక్షల నగదు, 8 ద్విచక్ర వాహనాల స్వాధీనం

**లేపాక్షి:** మండలంలోని తిమ్మగానపల్లి గ్రామంలో శుక్రవారం ఉదయం శ్రీసత్యసాయి జిల్లా ఎన్‌ఫోర్సుమెంట్ బృందంతో పాటు స్థానిక పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. 12 మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి, రూ.1.33 లక్షల నగదుతో పాటు 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మునీర్ అహమ్మద్ పేర్కొన్నారు. పేకాట రాయుళ్లను కోర్టులో హాజరు పరుస్తామన్నారు.

## ఇళ్ల నిర్మాణాల్లో పురోగతిపై సమీక్ష

**గోరంట్ల:** మండల పరిషత్ కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతిపై మండల ప్రత్యేకాధికారి, జిల్లా పంచాయతీ అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి, హౌసింగ్, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఆయా సచివాలయాల పరిధిలో ఇళ్ల నిర్మాణాల పురోగతిని హౌసింగ్ ఏఈ జగదీష్‌ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథగుప్త , సచివాయ ఇంజనీర్లు , వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి

**మడకశిరరూరల్:** గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి సిబ్బందికి సూచించారు. ఆమె శుక్రవారం కల్లుమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా రికార్డులను పరిశీలించారు. ఆనంతరం సీజనల్ వ్యాధులు, వైఎస్సార్ ఫ్యామిలీ డాక్టర్ సేవలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలు, రోజు ఎంతమంది పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ అప్రమత్తం చేయాలన్నారు. విధి నిర్వహణలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో ప్రజలకు వైద్య సేవలు అందించాలన్నారు. వైఎస్సార్ ఫ్యామిలి డాక్టర్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మలేరియా నివారణ మాసోత్సవం ర్యాలీలో పాల్గొన్నారు. ఈనెల 30 వరకు గ్రామాల్లో మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తారని తెలిపారు. డివిజన్ మలేరియా అధికారి కోదండరామిరెడ్డి, డాక్టర్ మాధుర్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పించాలి**

**మడకశిర:** మలేరియాపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి సిబ్బందికి సూచించారు. శుక్రవారం మడకశిరలో మలేరియా నివారణ మాసోత్సవాలకు సంబంధించిన పోస్టర్లు, కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని, ఈ విషయంలో మహిళలను చైతన్యవంతం చేయాలన్నారు. ఇళ్ల ముందు మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా అర్బన్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం పరిధిలో మెడికల్ ఆఫీసర్ మంజుల, వైద్య సిబ్బంది మలేరియా వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. మడకశిర డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

## గంగమ్మ విగ్రహ ప్రతిష్ట



అలంకరణలో గంగమ్మ విగ్రహం

**లేపాక్షి:** చోళసముద్రంలో గంగమ్మ దేవాలయంలో శుక్రవారం అమ్మవారి విగ్రహాన్ని భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన ఎన్‌ఆర్ఐ కేశవ మూర్తి దంపతులు రూ.5 లక్షలకు పైగా ఖర్చు చేసి నూతన దేవాలయాన్ని నిర్మించారు. చాలా సంవత్సరాలుగా శిథిలావస్థలో ఉన్న దేవాలయాన్ని నిర్మించడంపై ఎంపీపీ వెంకటరత్నమ్మ, సర్పంచ్ నందిని, మండల కన్వీనర్ నారాయణస్వామితో పాటు గ్రామ పెద్దలు ఎన్ఆర్ఐ దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విఘ్నేశ్వర ఆలయంలో చోరీకి విఫలయత్నం

- పూజారి అప్రమత్తతతో పరారైన దొంగలు

**హిందూపురం:** పట్టణంలోని మేళాపురం ఎస్‌బీఐ కాలనీ వద్ద ఉన్న పంచముఖ విఘేశ్వర ఆలయంలో గురువారం అర్ధరాత్రి దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. ఆలయం గేటుకడ్డీలు వంచి తాళాలను పగులగొట్టడానికి ప్రయత్నిస్తుండగా.. గమనించిన చుట్టుపక్కల వారు ఆలయ పూజారి కృష్ణమూర్తి శర్మకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. పూజారి వెంటనే మరో ఇద్దరు యువకులను వెంట పెట్టుకుని ఆలయం వద్దకు చేరుకున్నారు. పూజారి కేకలు వేయడంతో ఇద్దరు దొంగలు పెనుకొండ రోడ్డు వైపు పరుగులు తీశారు. మరికొందరు అక్కడి వచ్చి వెతికినా దొంగలు తప్పించుకున్నారు. కాగా హిందూపురం పరిసర ప్రాంతాల్లో ఆలయాలను టార్గెట్‌గా చోరీలకు ప్రయత్నాలు చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. నాలుగు రోజుల క్రితం కిరికెర అయ్యప్ప స్వామి ఆలయంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గుడి తాళాలు పగులగొట్టి అయ్యప్ప విగ్రహానికి ఉంచిన బంగారు రెండు కన్నులు, వెండి కిరీటం ఇతర వస్తువులను ఎత్తుకెళ్లారు. అంతకు ముందు రైల్వే రోడ్డులోని అనంత పద్మానాభ స్వామి ఆలయంలో దొంగలు ప్రవేశించి నంది విగ్రహాన్ని ఎత్తుకెళ్లారు. ఇలా ఆలయాల్లో చోరీలకు పాల్పడుతూ విలువైన వస్తువులు, హుండీల్లోని నగదు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. పోలీసులు నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయండి



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

**అమరాపురం:** మండలంలో ప్రధానమంత్రి అవాస్ యోజన కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి నరసింహమూర్తి సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయాల వారిగా ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి, ఏఏ దశలో ఉన్నాయి తదితర వివరాలను తెలుసుకున్నారు. ఈ ఏడాది లోపు మండలంలోని 357 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. అంతకముందు ఆయన గౌడనకుంటలో అంజినప్ప నిర్మాణం చేస్తున్న ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరగా ఇంటి నిర్మాణం చేయాలని లబ్ధిదారుడికి సూచించారు. గౌడనకుంట ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టికతోపాటు లబ్ధిదారులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. ఎంతమంది ప్రీ స్కూల్ పిల్లలు ఉన్నారు, గర్భిణులు, బాలింతలు ఎంతమంది ఉన్నారు, శుక్రవారం మెనూ ఏం ఇస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునిస్వామి, హౌసింగ్ ఏఈ గణేష్ పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామారావు

**రొళ్ల:** బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని సీడీపీఓ నాగమల్లేశ్వరి, ఎంపీడీఓ రామారావు పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలకు 18, బాలురకు 21 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలన్నారు. బాలికల సంరక్షణ అందరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. మాతశిశు సంరక్షణలో భాగంగా ప్రభుత్వం 'జగనన్న సంపూర్ణ పోషణ ఆహార పథకం ' కింద పౌష్టికాహారం అందిస్తోందన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలపై వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సన్నమ్మ, మండల పరిషత్ సిబ్బంది, అంగనవాడీ వర్కర్లు పాల్గొన్నారు.

**బాల్య వివాహాలను అరికట్టాలి**

**లేపాక్షి:** బాల్య వివాహాలను అరికట్టాలని, ఆడబిడ్డకు 18 సంవత్సరాలు నిండిన తరువాతనే వివాహాలు చేయాలని లేకపోతే చాలా సమస్యలు తలెత్తుతాయని హిందూపురం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ రెడ్డిరమణమ్మ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం చోళసముద్రం సెక్టార్ పరిధిలోని శిరివరం, మానేపల్లి గ్రామాల్లో గ్రాడ్యుయేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నేత్రావతి, ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, సూపర్‌వైజర్ జయమ్మ పాల్గొన్నారు.

## ఉప ఖజానా కార్యాలయం తనిఖీ

**మడకశిర:** పట్టణంలోని ఉప ఖజానా కార్యాలయంలో శుక్రవారం ఖజానా అకౌంట్స్ అధికారిణి నాగమల్లిక తనిఖీ చేపట్టారు. 2021–22కు సంబంధించి మడకశిర ఖజానా కార్యాలయంలో ప్రభుత్వ శాఖలో పని చేస్తున్న ఉద్యోగులకు చెందిన జీతాల బిల్లులు, ఇతరాత్ర బిల్లులు, విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ల బిల్లుల చెల్లింపులు, స్ట్రాంగ్ రూమ్ డిపాజిట్స్, ఎన్నికల సంబంధించిన బాక్సులు, ఇతర రికార్డులు ఆమె పరిశీలించారు. రికార్డుల్లో లోపాలు, ఉద్యోగులకు బిల్లుల చెల్లింపులు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయా అని పరిశీలించామని, వాటిలో లోపాలు ఉంటే సంబంధిత అధికారులపై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల బిల్లుల చెల్లింపులపై ఫిర్యాదులు తమకు అందింతే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్యోగులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి బిల్లుల మంజూరులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశామన్నారు.

## 4న హనుమాన్ శోభాయాత్ర

**పెనుకొండ:** పట్టణంలో ఈ నెల4న హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ నాయకులు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని 44వ జాతీయ రహదారి నుంచి ప్రధాన రహదారుల అనంతరం భోగసముద్రం చెరువు వరకు శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.